ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 17.0

ఇద్దరు ఐఏఎస్ అధికారుల బదిలీ

- నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ నెల్లూరుకు బదిలీ
- కాకినాడ జేసీగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య

ఏలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పని చేస్తున్న ఐఏఎస్ అధికారులలో 21 మందిని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో జిల్లాకు చెందిన ఇద్దరు అధికారులు ఉన్నారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ ఆదిత్యను కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఐ.అల్లైఖ్యాను నియమించారు. నూజివీడు సబ్ కలెక్టర్‌గా పని చేస్తున్న ఆదర్శ్ రాజేంద్రన్‌ను శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు.

కదన రంగంలో.. కమలం

భారతీయ జనతా పార్టీ ఎన్నికల కదన రంగంలోకి దిగడానికి అంతర్గతంగా భారీ కసరత్తు చేస్తోంది. పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా ఆశావహుల నుంచి ఇప్పటికే దరఖాస్తులను అందుకుంది. గతంలో ఒక్కో నియోజకవర్గంలో మూడంకెలు దాటకుండా బొటాబొటిగానే ఓట్లు లభించాయి. కాని ఈ మధ్య కాలంలో తమ పార్టీ పుంజుకుందని, మిగతా పార్టీలకు పోటీగా, సమానంగా నిలదొక్కుకోవడానికి సిద్ధమనే సంకేతాలను బయటకు పంపుతోంది. ఆ మేరకు పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేసింది. జిల్లా అధ్యక్షులతో పాటు కోర్ కమిటీలు, క్లస్టర్ల వారీగా ఇన్‌చార్జ్‌లు, కో-ఇన్‌చార్జ్‌లను తాజాగా నియమించింది. పార్టీ పదాధికారులు నియోజకవర్గాల్లో బలాబలాలపై ఇప్పటికే ఆరా తీసి నివేదికలు సిద్ధం చేశారు. రానున్న కొద్ది రోజుల్లోనే ఆ పార్టీ కీలక నిర్ణయాలు తీసుకునేందుకు అడుగులు వేస్తోంది. ఇతర పార్టీలతో పొత్తు ఉంటుందా, లేదా అనేదానిపై స్పష్టత ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు భారీగా దరఖాస్తులు

- సీనియర్లతోపాటు కొత్త ముఖాలు కూడా రెడీ
- నిలదొక్కుకోవడానికి వీలుగా ఎత్తులు
- క్షేత్రస్థాయిలో పట్టున్న వారికే ఈసారి అవకాశం
- క్లస్టర్ ఇన్‌చార్జ్‌లుగా తపన చౌదరి, లక్ష్మీనారాయణ


విక్రమ్ కిషోర్ | తాతాజీ | తపన చౌదరి | లక్ష్మీనారాయణ | శ్రీనివాస వర్మ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి వీలుగా బీజేపీ నేతలు ఇప్పుడు క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రంగంలోకి దిగుతున్నారు. పార్టీ గతంకంటే పుంజుకుందనే ధీమాతో నేతలు ఉన్నారు. తాజాగా రాష్ట్ర నాయకత్వం మారి ఆ స్థానంలో పురందేశ్వరి పార్టీ పగ్గాలు చేపట్టడమే కాకుండా జిల్లాలను చుట్టిముట్టి వచ్చారు. జిల్లా స్థాయి కేడర్‌కు ఆమె సమయం కేటాయిస్తుండడం, తదనుగుణంగానే పార్టీ నుంచి ఆదేశాలు వెలువడిన వెంటనే రంగంలోకి దిగి, సర్దుబాటు చేయడం వంటి చర్యల్లో ఈమధ్యన పురోగతి కనిపిస్తోంది. ప్రత్యేకించి జిల్లా అధ్యక్ష స్థానాలతో పాటు కొత్త కమిటీలను నియమించారు. పాత కమిటీల్లో ఉన్న సీనియర్లకు పదోన్నతి కల్పిస్తూ వారిలో అసంతృప్తి లేకుండా జాగ్రత్తపడ్డారు. అయినా కొందరు ఈ విషయంలో వెనుకబడే ఉండడం పట్ల అసంతృప్తి లేకపోలేదు.ఏలూరు జిల్లాలో కేడర్, నియోజకవర్గ నాయకత్వాలు సమన్వయం సాధించేలా ఇప్పటివరకు తీసుకున్న చర్యలన్నీ ఫలించాయి. ఈ నేపథ్యంలోనే పొత్తు సంగతి ఎలా ఉన్నా ఎన్నికల రంగంలో నిలదొక్కుకోవడానికి వీలుగా బీజేపీ తన కేడర్‌ను అప్రమత్తం చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న గారపాటి సీతారామాంజనేయచౌదరి (తపన చౌదరి) ఏలూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేయాలనే భావంతో ఇప్పటికే ఆయన కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు సాగిస్తున్నారు. తాగునీరు సరఫరాకు వీలుగా ట్యాంకర్ల ఏర్పాటు, కొన్ని గ్రామాల్లో దేవాలయాల నిర్మాణం, మరికొన్ని చోట్ల సేవా కార్యక్రమాల నిర్వహణకు విరాళాలు ఇస్తూ దాదాపు చాలా నియోజకవర్గాల్లో నిలదొక్కుకున్నారు. బీజేపీ పక్షాన ఒంటరిగానైనా లేకుంటే రాష్ట్ర రాజకీయాల్లో భాగంగా ఆకస్మిక పొత్తులు ఏర్పడితే ఆ దిశగాను పోటీకి ఆయన ఇప్పటికే సమాయత్తమయ్యారు. సీనియర్లను దగ్గర చేర్చుకోవడం, కేడర్‌తో తాను సన్నిహితంగా ఉండడం ద్వారా తగిన కార్పెట్ పరచుకున్నారు. తపనా చౌదరి తమ పార్టీ అభ్యర్థిగా చాలా కాలం నుంచి బీజేపీలో ప్రచారం సాగుతూనే ఉంది.

తాజాగా కొన్ని జిల్లాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఆయా క్లస్టర్లకు బీజేపీ ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఉత్తరాంధ్రలో అరకు, శ్రీకాకుళం, విజయ నగరం, విశాఖపట్నం, అనకాపల్లి క్లస్టర్‌కు ఇన్‌చార్జిగా తపన చౌదరిని నియమిం చారు. ఈ మధ్యనే అనారోగ్యానికి గురైన ఆయన కొంచెం తేరుకున్నారు. తిరిగి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా కదులుతున్నారు. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆశావహుల నుంచి బీజేపీ దరఖాస్తులను అందుకుంది. పోలవరంలాంటి ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న ఆశావహులంతా ఉన్నత చదువులు చదివిన వారే. ఏలూరు జిల్లా కేంద్రం నుంచి దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. వాస్తవానికి బీజేపీ బలాన్ని అంచనా వేస్తూ వస్తున్న కొంతమంది పోటీ వచ్చేసరికి తమకే టికెట్లు కేటాయించాలనే రీతిలో ఉన్నారు. ఇంతకుముందు జిల్లా అధ్యక్షులుగా కొనసాగిన వారు, వివిధ పదవుల్లో ఉన్న వారు సైతం ఇప్పుడు ఆశావహుల జాబితాలో ఉన్నారు. పూర్వపు జిల్లా అధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ ఇప్పుడు కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, నరసాపురం, ఏలూరు క్లస్టర్‌కు ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. దీనికి తోడు పశ్చిమలో సీనియర్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసవర్మ, పాకా సత్యనారాయణ వంటి నేతలంతా ఇప్పటికే ఎన్నికల కసరత్తులో నిమగ్నమై ఉన్నారు. ప్రత్యేకించి కీలక నియోజకవర్గాల్లో పోటీకి దిగేందుకు వీలుగా సన్నద్ధమవుతున్నారు.

కీలక స్థానాల్లో నువ్వా నేనా..

కీలక స్థానాల్లో పోటీ నువ్వానేనా అనేటట్టుగా మారనున్నందున ఆ మేరకు బీజేపీ సైతం తగిన అభ్యర్థులను రంగంలోకి దింపాలని యోచిస్తోంది. అందుకనే ఇప్పుడు ఎక్కడికక్కడ నియోజకవర్గ స్థాయి సమా వేశాలు నిర్వహిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ సైతం మరోవైపు నియోజకవర్గాలపై పూర్తిగా దృష్టి పెట్టింది. ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు ఎక్కడికక్కడ తగిన నివేదికలను సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేకించి జిల్లా అధ్యక్షులు తాతాజీ, విక్రమ్ కిషోర్‌తో పాటు మిగతా వారి పనితీరుపైన ఒక కన్నేసి ఉంచారు. ఇప్పుడు పార్టీకి అందిన దరఖాస్తులు చూస్తుంటే పార్టీకి ఇమేజ్ మరింత పెరిగినట్టుగా భావిస్తున్నామని సీనియర్లు చెబుతున్నారు. ఎందుకనంటే గతంలో ఉన్న పరిస్థితులు వేరు, ఇప్పుడున్న పరిస్థితులన్నీ పార్టీకి కాస్తంత అనుకూలంగానే కనిపిస్తున్నా యని సీనియర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు పార్లమెంటు నుంచి గారపాటి చౌదరి పోటీకి సిద్ధంగా ఉన్నందున నరసాపురం నుంచి ఎవరిని బరిలోకి దింపుతారనే విషయంపైన లోతైన కసరత్తు చేస్తున్నారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు ఏలూరు, నూజివీడుల, కైకలూరు అసెంబ్లీ స్థానాల నుంచి దాదాపు పది మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. దీనిని బట్టి చూస్తుంటే విద్యావంతులు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నవారు, వివిధ వర్గాలతో సాన్నిహిత్యం పొందిన వారినే అభ్యర్థులుగా ఎన్నిక చేసే అవకాశం ఉంది. రాష్ట్ర పార్టీ కార్యదర్శి శ్రీనివాసవర్మను సైతం ఈసారి ఎన్నికల బరిలోకి దింపే యోచనలో పార్టీ ఉన్నట్టు సమాచారం.




కొల్లేరులో సందడే.. సందడి

కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రానికి ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొల్లేరు సరస్సులో బోట్లలో షికారు చేస్తూ పక్షుల ఆవాస కేంద్రాలను, పక్షి పిల్లల కిలకిలారావాలను ఆస్వాదించారు. పెలికాన్, పెయింటెడ్‌స్కాక్, తెల్లకంకణాల పిట్ట, నారాయణపక్షి తదితర పక్షులను చూస్తూ పిల్లలు కేరింతలతో సందడి చేశా రు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్‌లో ఆటలు ఆడుకుంటూ గడిపారు. పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో పక్షుల నమూనాలను తిలకించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున రావడంతో బోటులో ప్రయాణానికి బారులు తీరి వేచి ఉండాల్సి వచ్చింది.

\- కైకలూరు



కంచె చేను మేస్తే..!

- బ్యాంకుల్లో సొమ్ములు భద్రమేనా...?
- ఖాతాదారుల్లో గుబులు..
- బ్యాంకులంటేనే భయపడే పరిస్థితి
- జంగారెడ్డిగూడెంలో గతంలో మూడు బ్యాంకుల్లో అవకతవకలు
- తాజాగా మరో బ్యాంకులో ఖాతాదారుడి సొమ్ములు మాయం...
- జంగారెడ్డిగూడెం సొసైటీలోనూ అవకతవకలు.. సర్దుబాటు చర్యలు..?



జంగారెడ్డిగూడెం, జనవరి 28: 'కంచె చేను మేస్తే' అనే చందంగా మారింది పలు బ్యాంక్‌లు, సొసైటీల పరిస్థితి. ఎంతో నమ్మకంతో ఖాతాదారులు సొమ్ములు దాచుకోవడమే తప్పా అవి భద్రంగా ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి. కొన్ని బ్యాంకుల్లో బయట పడుతున్న అవినీతి కుంభకోణాలతో బ్యాంకులంటేనే బెంబే లెత్తిపోతున్నారు. ఇటువంటి ఘటనలు జంగారెడ్డిగూడెం మండలం, పట్టణంలోని పలు బ్యాంకుల్లో వెలుగు చూశాయి. బ్యాంక్ సిబ్బంది కటకటాల పాలయ్యారే తప్పా బాధిత ఖాతాదారులకు న్యాయం జరగలేదని వాపోతున్నారు.

జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఉన్న ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒకరు అకౌంట్‌లో మూడు బాండ్ ద్వారా రూ.30 లక్షలు, రూ.12,50 లక్షలు, రూ.4.80 లక్షలు మొత్తం రూ.47.30 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఒక సంవత్సరానికి రెన్యువల్) చేసినట్టు సమాచారం. గత సెప్టెంబరులో రెన్యువల్ చేసుకుని బ్యాంక్‌కు వెళ్లి వడ్డీ తీసుకున్నారు. కానీ ఆ తర్వాత ఆ అకౌంట్‌కు సంబంధించి మొబైల్ ఫోన్ నెంబరు, మెయిల్ అడ్రస్సులు మార్చబడ్డాయి. ఇది బాధితుడు గమనించలేదు. సంక్రాంతి పండుగ సమయంలో ఖాతాదారుడు మెయిల్‌కు మొబైల్ నెంబరు, మెయిల్ ఐడీ చేంజ్ అయినట్టు గుర్తించి బ్యాంక్‌కు వెళ్లి అకౌంట్ చెక్ చేయగా మొత్తం రూ.47.30 లక్షల నుంచి రూ.21.50 లక్షలు దఫదఫాలుగా డ్రా చేసినట్టు చూపించింది. ఖాతాదారుడి ఫోన్ నెంబరు మార్చడం వల్ల డ్రా చేసినా ఎటువంటి మెస్సేజ్‌లు ఖాతాదారుడికి చేరలేదు. దీంతో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం బయటకు వస్తుందేమోనని అప్పటికప్పుడు ఖాతాదారుడి ఖాతాలో రూ.10.50 లక్షలు, నాలుగు రోజులు తర్వాత మరో రూ.10.50 లక్షలు చెల్లించి విషయాన్ని గోప్యంగా ఉంచినట్టు సమాచారం. అసలు డిపాజిట్‌దారుడి ఫోన్ నెంబరు మార్పు చేయడం, అతనికి తెలియకుండా అకౌంట్‌లో సొమ్ములు డ్రా చేయడం నేరం. అయినప్పటికి దానికి పాల్పడిన ఉద్యోగిని కాపాడుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఇదొక్క ఖాతా నుంచే సొమ్ములు మాయం అయ్యాయా, ఇలా మరి కొన్ని ఖాతాల్లో సొమ్ములు మాయం అయ్యాయా అనేది ప్రశ్నార్థకం.

జంగారెడ్డిగూడెం సొసైటీలోనూ కుంభకోణం..?

రైతులకు స్వల్పకాల, దీర్ఘకాలిక రుణాలతో ఆదుకోవాల్సిన జంగారెడ్డిగూడెం సొసైటీలో కుంభకోణం జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సొసైటీ కార్యదర్శి సొసైటీ నుంచి సుమారు రూ.1.36 కోట్లు దారి మళ్లించి సొంత అవసరాల కోసం ఖర్చు చేసినట్టు తెలిసింది. విషయం తెలుసు కున్న జిల్లా ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేస్తున్నారే తప్పా ముందుకు కదలనివ్వడం లేదు. ప్రధానంగా దారి మళ్లించిన ఆ ఉద్యోగిని కాపాడుకునేందుకే అధికార పార్టీ నాయకుడు పావులు కదపగా దానికి విచారణాధికారులు తలూపుతున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జంగారెడ్డిగూడెం సొసైటీ కుంభకోణంపై విచారణ జరుగుతోంది.

గతంలోను ...

జంగారెడ్డిగూడెం మండలం, పట్టణంలో రెండేళ్ల క్రితం చాలా కుంభ కోణాలు జరిగాయి. పట్టణంలోని ఒక బ్యాంక్‌లో 113 మందితో బ్యాంక్‌లో అకౌంట్‌లు ఓపెన్ చేయించి వారి చేత రోల్డ్‌గోల్డ్‌పై సుమారు రూ.89 లక్షలు రుణాలు పొంది ఆపై ఆ సొమ్ములు దారి మళ్లించిన ఘటన జరి గింది. దీనిపై ఆ బ్యాంక్ అప్రైజర్‌పై బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అతన్ని జైలుకు పంపారు.

జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం బ్యాంకులో ఖాతాదారుల సొమ్ములు దాదాపు రూ.80 లక్షల వరకు గోల్‌మాల్ అయ్యాయని, నకిలీ రశీదు ఇచ్చి సొమ్ములను కాజేశారని రోజులపాటు బాధితులు బ్యాంకుల ముందు ధర్నా చేశారు. బ్యాంక్ ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. బాధ్యులైన సిబ్బంది జైలు పాలయ్యారు. జంగారెడ్డిగూడెంలోని ఒక బ్యాంక్ మేనేజర్ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని, కొంత సొమ్మును దుర్వినియోగం చేశానని తెలుపుతూ సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తర్వాత కొంత కాలం బాధితులు ఆ బ్యాంక్ చుట్టూ తిరగాల్సి వచ్చింది.


ఇటీవల కోమటిలంకలో క్రీడాకారులు లేకపోవడంతో వాలీబాల్ ఆడుతున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది

ఆడలేం ఆంధ్ర!

- ఆసక్తి చూపని క్రీడాకారులు, సంఘాలు
- మరోవైపు సచివాలయాల్లో కనిపించని సెక్రటరీలు
- నేటితో ముగియనున్న జిల్లాస్థాయి పోటీలు

ప్రజల్లో తమపార్టీ ప్రచారం కోసం ప్రభుత్వం చేసిన కొత్త ఎత్తులు తుస్సుమన్నాయి. 47 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రారంభించిన క్రీడా పోటీలకు స్పందన కరువైంది. ఇప్పటికే మండల, నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. సోమవారంతో జిల్లాస్థాయి పోటీలు ముగియనున్నాయి. ఆర్భాటంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినా చాలా క్రీడాసంఘాలు దూరంగా ఉన్నాయి. క్రీడాకారులు ఆటల్లో పాల్గొనేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. చూసేవారు లేక ఆడేవారు లేక మైదానాలు వెలవెలబోయాయి. మొత్తానికి ఆర్భాటంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం 'ఆడలేం ఆంధ్ర'గా ముగియనుంది.

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 28 : ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రభుత్వం తలపెట్టిన క్రీడాపోటీల నిర్వహణపై అనేక ఆరోపణలు వచ్చా యి. ఇప్పటికే ఈ క్రీడాపోటీల పేరిట ఓట్ల వేట కోసం అధికార పార్టీకి అనుబంధంగా పనిచేసేవారికి కిట్లు పంచారన్న విమర్శలు ఉన్నాయి. దీనికి అలుసుగా తీసుకుని కొందరు పీఈటీలు ఆటలను సైతం పంచేసుకున్నారు. ఇష్టానుసారంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం జరిగింది. ముందే గెలుపు, ఓటమిలను నిర్దేశించారు. ఈ వ్యవహారంలో కొందరు పీఈటీలపై విమర్శలు వస్తున్నాయి. ఇదేం క్రీడాస్ఫూర్తి అంటూ ఆరోపణలు వస్తున్నాయి.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో..

ఎన్నికల హడావుడిలో అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ కార్యక్రమం పూర్తిగా అధికారపార్టీ నేతల చేతుల్లోకి వెళ్లింది. గ్రామీణ ప్రాంతంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీలకు వచ్చిన వారంతా వలంటీర్లు పురమాయించిన వారే ఎక్కువ. అధికార పార్టీకి సంబంధించిన వారు, తమ కనుసన్నల్లో పనిచేసే పీఈటీల ద్వారా మంచి జట్లు వేయించారు. వలంటీర్ల ద్వారా సమాచారం తెలుసుకుని అధికార పార్టీకి ఉపయోగపడే వారిని మండల స్థాయిలో మంచి టీమ్‌లో నియమించారు. మండల స్థాయిలో ఇప్పటి వరకు జరిగిన పోటీలు చూస్తే అసలు షెడ్యూల్ పాటించిన దాఖలాలే లేవు. ఈ పోటీలకు 15 ఏళ్లు పైబడిన వారినే తీసుకోవడంతో సమస్యలు అధికమయ్యాయి. భారీఎత్తున రిజిస్ట్రేషన్లు చేయించినా ఆ తర్వాత అంతా రాజకీయం అవ్వడంతో క్రీడాకారులు చాలా మంది తప్పుకున్నారు. మధ్యలో సంక్రాంతి సెలవులు కారణంగా చాలామంది ఆటగాళ్లు వెనుతిరిగారు. దీంతో ఆటగాళ్లు లేక జనంలేక వెలవెలబోయిన పోటీలను బయటకు తెలియకుండా ఉండడం కోసం ఆటలను కొందరు పీఈటీలు పంచేసుకున్నారు. ఇటీవల ఏలూరు ఇండోర్ స్టేడియంలో క్రికెట్ ఫైనల్ పోటీల్లో ప్రత్యర్థి జట్టుతో తలపడకుండానే విజేతను నిర్ణయించి రూ.35 వేలు చెక్కును మహిళా టీమ్‌కు అందజేయడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల్లో పార్టీపేరును ప్రచారం చేయాలని ప్రభుత్వం వ్యూహం పన్నింది. రెండునెలల పాటు గ్రామ, సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా పోటీలు నిర్వహించి సీఎం ఫొటోతో పబ్లిసిటీ ఇచ్చింది. అధికారులు సైతం తమ విధులను చేసుకోకుండా ఈ కార్యక్రమం సక్సెస్ చేయాలని విసుగు పుట్టించారు. నిధులు కేటాయించకపోగా నిర్వహణపై అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. పేరుకు అన్నిచోట్ల అధికారులు పోటీలను ప్రారంభించి వెళ్ళిపోయారు. ఆ తరువాత ఆటగాళ్లు లేక మైదానాలు బోసిపోయాయి. సచివాలయాల్లో అధికారులు అందుబాటులో లేక పౌరసేవలు కరువు అయ్యాయి.


కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

నిడమర్రు జనవరి 28 : గోవింద నామస్మరణతో మందలపర్రు మారు మోగింది. వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణం కనులారా చూసేందుకు వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. ఆదివారం మందలపర్రులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వరాస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం వేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమం తోమాల సేవ, సహస్రనామార్చన, తిరుమంజన సేవ, ఉస్తవర్ల సమర్పణ జరిగింది. అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ ఆకెళ్ల విభీషణశర ఆధ్యాత్మిక ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం పగడాల ఆనంద తీర్థాచార్యులు చేసిన ఉపన్యాసం అందరిలో భక్తిభావం పెంపొందించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వ హించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆలరించాయి. సాయంత్రం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. భక్తులు భక్తిపారవశ్యంతో తరించారు. టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు నెరుసు సత్యంబాబు, గాదిరాజు సుదర్శనరాజు, సంకు నాగేషు, కోడే కాశీవిశ్వనాథ్, వెజ్జు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా తవ్వేస్తున్నారు


మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

- అంకన్నగూడెం చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు
- అధికార పార్టీ నేతల బరితెగింపు
- అడ్డుకున్న గ్రామస్థులు.. ఇరువర్గాల ఘర్షణ



పెదవేగి, జనవరి 28 : అంకన్నగూడెంలో కొత్తకుంట చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు అధికార పార్టీ నేతలు తెరలేపారు. ఆదివారం మధ్యాహ్నం మట్టిని అక్రమ తవ్వుతుండగా గ్రామస్థులు అడ్డుకోవడంతో గ్రామస్థులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అదుపు చేశారు. అప్పటికి తాత్కాలికంగా వివాదం సమసినప్పటికీ తిరిగి సాయంత్రానికి ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో పాటు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు మరోసారి గ్రామానికి చేరుకుని, ఇరువర్గాలను చెదరగొట్టి, పరిస్థితిని అదుపు చేశారు.

టిప్పర్ల అడ్డగింత

ముదినేపల్లి, జనవరి 28 : పెదగొన్నూరులో బుసక రవాణాపై శనివారం రాత్రి వివాదం చెలరేగింది. ఆ గ్రామ ఏరియాలోని ఓ చెరువు మరమ్మతుల పనులు నిర్వహిస్తూ టిప్పర్లతో బయటి ప్రాంతాలకు మట్టిని తరలిస్తుండడం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని, టిప్పర్ల రాకపోకల శబ్దంతో రాత్రిళ్ల అసౌకర్యా నికి భయానికి గురవుతున్నామని పలువురు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తూ బుసక రవాణా వాహనాలను నిలిపివేశారు. దీంతో బుసక రవాణా చేస్తున్న వ్యక్తులకు గ్రామస్థులకు వాగ్వాదం జరిగింది. దీనిపై ఫోన్‌లో గ్రామానికి చెందిన పాండ్రంకి కిరణ్ కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు ఏలూరు ఆర్డీవో ఖాజావలీ టిప్పర్ల రాకపోకలను పరిశీలించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పెదగొన్నూరు వెళ్లి బుసక రవాణాను నిలిపేశారు. గుడివాడ సమీపంలోని జాతీయ రహదార్ల పనులకు బుసకను సరఫరా చేస్తున్నందున టిప్పర్ల ద్వారా రవాణాను గ్రామంలో నుంచి కాకుండా వేరే మార్గం ద్వారా నిర్వహించుకోవాలని రవాణాదారులకు అధికారులకు సూచించారు. దీంతో ఆదివారం టిప్పర్లకు బ్రేక్ పడింది.


పెదగొన్నూరులో బుసక రవాణా టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్థులు




నారాయణపురం సభలో మాట్లాడుతున్న రామాంజనేయులు, సెమీస్‌లో తలపడుతున్న పశ్చిమ గోదావరి, విజయనగరం జట్లు

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం

ఉంగుటూరు, జనవరి 28 : నారాయణపురం శ్రీచింతలపాటి సీతారామ చంద్ర వరప్రసాద మూర్తిరాజు కళాశాల ప్రాంగణంలో 45వ రాష్ట్రసాయి అండర్-19 బాలుర హ్యాండ్ బాల్ టోర్నీ ఆదివారం ప్రారంభమైంది. రెండో రోజుల పాటు జరిగే టోర్నీలో ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, విశాఖ, కృష్ణా, నంద్యాల, కడప, కర్నూలు, అనంతపురం, కడప, విజయనగరం మొత్తం పదకొండు జట్లు పాల్గొన్నాయి. ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజ నేయులు, ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చొరవ వల్ల ఈ పోటీలు జరగడం అభినందనీయమన్నారు. సెమీ ఫైనల్స్‌కు విశాఖ, నంద్యాల, పశ్చిమ గోదావరి, విజయనగరం జట్లు చేరాయన్నారు. రెండు రోజుల పాటు జరుగుతున్న పోటీలకు దాతలు నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకనంద, రుద్రరాజు రామచంద్రరాజు, వర్మ, పెన్మత్స రామచంద్రరాజు, ఆళ్ల సతీష్‌చౌదరి, రామాంజనేయులు, సి.శ్రీనివాసులు తదితరులు సేవలందించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు ప్రారంభం



స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు

భీమవరం అర్బన్, జనవరి 28: అంతర్‌జిల్లాల 67వ స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు భీమవరంలోని చింతలపాటి బాపిరాజు పాఠశాలలో ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో అండర్-14, 17, 19 విభాగాల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలకు సుమారు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 405 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పోటీల కన్వీనర్ జీపీసీ శేఖర్ రాజు తెలిపారు.

రేపు పెంటపాడు డీఆర్‌జీ కాలేజీలో జాబ్ మేళా

పెంటపాడు, జనవరి 28 :పెంటపాడు డీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఈనెల 30న బాబ్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. జవహర్ నాలెడ్జి సెంటర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో పేటీఎం, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్, అపోలో ఫార్మసిస్ లిమిటెడ్, ఆస్ట్రోటెక్ స్టీల్స్, పాక్స్‌కాన్, ముత్తూట్ ఫైనాన్స్ మొత్తం ఆరు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీ, ఫార్మసీ, పీజీ చదివిన 27 నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల యువతీ, యువకులు అర్హులన్నారు. ఆసక్తిగల వారు బయోడేటాతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం పది గంటలలోగా కళాశాల ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు.

రేపు, ఎల్లుండి గీత కార్మిక రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నరశింహమూర్తి

తణుకు, జనవరి28 : ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 15వ మహాసభలు తణుకులో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరశింహమూర్తి తెలిపారు. ఆదివారం లయన్స్ క్లబ్ వద్ద విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న మోకులు ధరించి గీతకార్మికుల మహా ప్రదర్శన మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమై లయన్స్ ఆడిటోరియం వరకు కొనసాగుతుందన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ తదితరులు విచ్చేస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గీత వృత్తిని సర్వనాశనం చేశారని, ఉన్న ఉపాధిని దెబ్బతీసి కార్మికులు బతకలేని స్థితి కల్పించారన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి, ఉపాధ్యక్షుడు గుబ్బల రాఘవులు, మామిడి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో సామాజిక న్యాయం అబద్ధం

▸ చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ఏలూరుటూటౌన్, జనవరి 28 : వైసీపీలో సామాజిక న్యాయం అని చెప్పే సీఎం జగన్మోహన్ రెడ్డి మాటలన్నీ అబద్ధమని, ఆ పార్టీలో దళితులకు సముచిత న్యాయం జరగడం లేదని చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఆదివారం ఏలూరు ఏఎస్సార్ స్టేడియం వద్ద మాలమహాసేన జాతీయ అధ్యక్షుడు అలగా రవికుమార్ ఆధ్వర్యంలో దళిత శంఖారావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో విశ్వసనీయతలేని ఎమ్మెల్యే అభ్యర్థులను మారుస్తానని జగన్ చెప్పి ఒక్క దళితుల సీట్లు మాత్రమే మారుస్తూ దళితులకు తీరని అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి బకాసా అధ్యక్షుడు బాల కోటయ్య మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకుని అన్యాయం చేసిందన్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు త్వరలో ఉన్నాయన్నారు. దళిత నాయకులు మల్లెల వెంకట్రావు, రమేష్ మాట్లాడుతూ దళితుల ఓట్లతో గెలిచి తీరని ద్రోహం చేసిన జగన్‌కు దళితులు బుద్ధి చెబుతారన్నారు.

ఏలూరులో 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' టీమ్ సందడి



మాట్లాడుతున్న హీరో సుహాస్, హీరోయిన్ శివానీ

ఏలూరు కల్చరల్, జనవరి 28: రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 2న విడుదల కానున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం హీరో, హీరోయిన్ సుహాస్, శివానీ ఏలూరులో సందడి చేశారు. ఆర్ఆర్‌పేటలో నడుచుకుంటూ వెళుతూ సినిమాను విజయవంతం చేయాలంటూ ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో హీరో సుహాస్ మాట్లాడుతూ గతంలో విడుదలైన 'కలర్ ఫొటో' మంచి గుర్తింపు తెచ్చిందన్నారు. 2వ తేదీన విడుదల కానున్న 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' తన కెరియర్‌లో మంచి చిత్రంగా నిలిచిపోతుందన్నారు. మరో రెండు సినిమాల్లో ప్రసన్నవరం, కేబుల్‌రెడ్డి చిత్రాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. హీరోయిన్ శివానీ మాట్లాడుతూ కుటుంబపరంగా చూడదగ్గ చిత్రమని ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. డెనిమ్ అధినేత కత్తిరి రామ్మోహన్ స్వాగతం పలికారు. వీరిని పలు అభిమాన సంఘాల నాయకులు శాలువా కప్పి సత్కరించారు.

పెద్దపులి పంజా

▸ దేవినేనివారిగూడెంలో పశువులపై దాడి
▸ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారుల సూచన
▸ ముండూరు సమీపంలో బోను ఏర్పాటు

ద్వారకాతిరుమల, జనవరి 28 : పెద్దపులి పంజా విసిరిన ఘటన దేవినేనివారిగూడెంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలో రెండు ఆవులు, ఓ దూడపై పులి దాడి చేయడంతో అవి బెంబేలెత్తి కట్లు తెంపుకుని రోడ్డుపైకి పరుగులు తీశాయి. రైతులు, స్థానికుల గుండెల్లో భయం పెరిగింది. బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. వివరాలివి.. తిమ్మాపురానికి చెందిన రైతు పాకలపాటి మధుకు దేవినేనివారిగూడెంలో పొలం ఉంది. ఆయన ఆదివారం ఉదయం నాలుగు గంటలకు పొలానికి వచ్చేసరికి తన మూడు ఆవులు గాయాలతో రోడ్డుపై అరుస్తూ నిలబడి ఉండడాన్ని చూసి వాటిని పరిశీలించి సాటిరైతులకు సమాచారం ఇచ్చాడు. అందరూ వచ్చిచూడగా ఆవులపై పులి గోళ్లతో దాడి చేసినట్టు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రదామ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడికి గురైన ఆవులను, ఆ ప్రాంతంలో పులి అడుగుజాడలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులనుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాపికొండల అటవీప్రాంతం నుంచి పులి తప్పిపోయి వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. ఇది పగలంతా విశ్రాంతి తీసుకుంటూ రాత్రివేళ రోజుకు దాదాపు 15 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, కొద్దిరోజులు రైతులు, స్థానికులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరూ హాని కల్గించవద్దని అలాచేస్తే వన్యప్రాణిరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. గ్రామాల్లో సాయంత్రం ఐదు ఐదు గంటల తర్వాత తిరగద్దని టాంటాం వేయించాలని సూచించారు. రైతుల పశువులకు ఈ పులివల్ల నష్టం జరిగితే నష్టపరిహారం చెల్లిస్తామన్నారు.



పులిని బంధించడం కోసం తీసుకొస్తున్న బోను

బోను ఏర్పాటు చేస్తున్నాం : రవీంద్ర దామా

పెదవేగి, జనవరి 28 : ముండూరు పరిసర ప్రాంతాల్లో పెద్దపులి కదలికలను గుర్తించామని, పులిని పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దామా తెలిపారు. శనివారం ఉదయం దెందులూరు మండలం పెరుగ్గూడెం, చల్లచింతలపూడి గ్రామాల్లో పులి పాదముద్రలు గుర్తించగా, ఆదివారం మేదినరావుపాలెం మీదుగా పెదవేగి మండలం ముండూరు సమీపంలో పోలవరం కుడికాలువ సమీపంలో పంటపొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. రాజమహేంద్రవరం ముఖ్య అటవీ సంరక్షణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, రాజమహేంద్రవరం డీఎఫ్‌వో ఎ.త్రిమూర్తులురెడ్డి, ఇతర అధికారులతో కలిసి పులి తిరిగినట్టు గుర్తించిన ప్రదేశాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండూరు, మేదినరావుపాలెం, ధర్మారావుపేట, చక్రాయగూడెం, సీతారామపురం గ్రామాల చుట్టుపక్కల పులి తిరుగుతున్నట్టు గుర్తించామన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాత్రి సమయంలో ఒంటరిగా పొలాలకు వెళ్ళవద్దు, ముఖ్యంగా పోలవరం కుడికాలువ పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. పెద్దపులిగా అనుమానిస్తున్న జంతువు సమాచారం తెలిస్తే అటవీశాఖాధికారులకు సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1800 425 5909 కు అందించాలని సూచించారు.



దేవినేనివారిగూడెం గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీఅధికారి రవీంద్ర



పులి దాడికి గురైన ఆవు



పులి పాదముద్ర

ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు పెంచేందుకు కృషి చేస్తా

▸ ఐటీడీఏ పీవో సూర్యతేజ



కుక్కునూరు ప్రభుత్వాసుపత్రిలో గిరిజన మహిళను పరామర్శిస్తున్న పీవో సూర్యతేజ

కుక్కునూరు, జనవరి 28 : 'ఏజెన్సీలో వైద్య సౌకర్యాలు ఇంకా పెంచేందుకు కృషి చేస్తా.. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటుపై మరోసారి ప్రతిపాదన పంపుతా.. పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు కల్పన, మరింత వైద్యం అందుబాటులో తెచ్చేందుకు మొబైల్ అంబులెన్స్‌లు, గిరిజనుల్లో సాధారణ ప్రసవాలపై అవగాహన పెంపు, మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేలా అటవీశాఖాధికారులతో మాట్లాడుతా' అని కేఆర్‌పురం ఐటీడీఏ పీవో సూర్యతేజ అన్నారు. కుక్కునూరు మండలం జిన్నెలగూడెం వలస ఆదివాసీ మహిళ కూరం కోసి అనే గర్భిణి డోలీలో నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించి కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన విషయం విదితమే. ఈ క్రమంలో కుక్కునూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆమెను ఆదివారం ఆయన పరామర్శించారు. జరిగిన ఘటనపై ఆమె నుంచి పలు విషయాలు అడిగారు. సకాలంలో స్పందించిన వైద్య సిబ్బందిని ప్రశంసించారు. ఈ క్రమంలో 2014లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నాలుగు పీహెచ్‌సీలకు అనుసంధానంగా కుక్కునూరులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసే ప్రతిపాదనను అప్పటి ప్రభుత్వం చేసిందని అది ముందుకు సాగడం లేదని, రెండు మండలాల ప్రజలు మెరుగైన వైద్యం కోసం వెళ్లాలంటే 50 నుంచి 70 కిలోమీటర్లు అటు తెలంగాణలోని భద్రాచలం, ఇటు ఆంధ్రలోని జంగారెడ్డిగూడెం వెళ్లాల్సి వస్తోందని పలువురు విలేకర్లు ఆయన దృష్టికి తీసుకురాగా పైవిధంగా ఆయన స్పందించారు. అనంతరం కుక్కునూరులోని గిరిజన బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. పలువురు విద్యార్థులు వసతి గృహంలో ఉండకపోవడాన్ని గుర్తించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథలిన్, డాక్టర్ పూర్ణశ్రీనివాస్, డాక్టర్ రమేష్, వైసీపీ నాయకులు రావు వినోద్, రాము తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 28 : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తి అధిక మోతాదులో మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు పోణంగి రోడ్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన విడుతూరి రత్న ప్రకాష్(52)గత కొన్నేళ్ళ నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ మేరకు మనస్తాపానికి గురై జీవితంపై విరక్తితో అధిక మోతాదులో మాత్రలను మింగి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై అతడి భార్య ఇందిర ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు. మృతదేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 28 : భర్త, అత్త, మామలతో గొడవపడి ఒక వివాహిత ఇంటి నుంచి వెళ్ళిపోయిందని ఆమె తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన నంబూరి పూజిత(22) భర్త, అత్త, మామలతో గొడవపడి ఈనెల 27న ఇంటి నుంచి వెళ్లిపోయింది. లింగపాలెం మండలం రంగాపురానికి చెందిన ఆమె తల్లి సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

ముసునూరు, జనవరి 28: మండలంలోని కాట్రేనిపాడు శివారు పామాయిల్ తోటలో పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 10 మోటారు వాహనాలు, రూ. 22 వేలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వాసు తెలిపారు. మండలంలో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంటిముందున్న కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

ఏలూరు క్రైం, జనవరి 28 : ఏ కారణమో తెలియదు కాని ఇంటి ముందు పార్కు చేసిన ఒక కారు అర్ధరాత్రి వేళ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన చేరి మంటలను అదుపుచేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు మండలం చాటపర్రు రోడ్డులోని ఆళ్ళ నాని కాలనీలో నివాసం ఉంటున్న లంకలపల్లి మల్లేశ్వరి పేరుపై 2021 మోడల్ కారు ఉంది. ఇంటిముందు యథావిధిగా శనివారం పార్కు చేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల సమయంలో ఆ కారు ఒక్కసారి మంటల్లో కాలిపోతూ కనిపించింది. ఆ ప్రాంతానికి చెందిన శ్రీదొరబాబు అనే వ్యక్తి వెంటనే ఏలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అదనపు ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. అప్పటికే ఆ కారు పూర్తిగా దగ్ధమైంది. ఎవరైనా దగ్ధం చేశారా ? షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించి కారు దగ్ధమైందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భద్రతలేని బతుకులు



పొగాకు పచ్చిఆకు బంటా ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక పాకలు

ఉపాధి కోసం వచ్చి.. ప్రాణాలు ఫణం

▸ గుంటూరు, మహారాష్ట్ర, కృష్ణాల నుంచి వలసలు
▸ ఈనెలలోనే రెండు ఘటనలు
▸ గుంటూరు నుంచి వచ్చిన 8 మంది చిన్నారుల అస్వస్థత
▸ ఇటీవల కర్నూలు నుంచి వచ్చిన ఇద్దరు చిన్నారుల మృతి

పొట్టకూటి కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి ప్రాణాలను ఫణంగా పెడుతున్నారు. ఏక్షణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో భద్రత లేని జీవితాలను సాగిస్తున్నారు. వందలాది కిలోమీటర్లు దాటి ఇక్కడ తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. ఎక్కడో ఖాళీ స్థలాల్లో, పొలాల్లో గుడారాలు, తాటాకు పందిళ్లు వేసుకుని కుటుంబ సమేతంగా కాలం గడుపుతున్నారు. మళ్లీ ఇక్కడ పనులు ముగించుకుని వారి సొంత గ్రామాలకు వెళ్లిపోతారు. ఉపాధి దొరికే సమయంలో వారి పిల్లలు చదువులకు దూరం అవ్వడంతో పాటు ఇళ్ల వద్దే ఒంటరిగా ఉంటూ ప్రమాదకరమైన పరిస్థితులో జీవనం సాగిస్తున్నారు.

- జంగారెడ్డిగూడెం



ఇటీవల మృతి చెందిన అన్నదమ్ములు (ఫైల్)



రెల్చిన పొగాకు ఆకులను క్యూరింగ్‌కు సిద్ధం చేస్తున్న కార్మికులు (ఫైల్)

వలస కూలీలు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో రెండు, దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెంలలో మొత్తం 5 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. ప్రధాన వాణిజ్య పంటైన వర్జీనియా పొగాకుకు సంబంధించి పచ్చిఆకు బంటా కార్మికులుగా పనిచేసేందుకు అనేకమంది ఇతర జిల్లాల నుంచి సీజన్‌లో వలసలు వచ్చి పనులు చేసుకుంటుంటారు. మహారాష్ట్ర, గుంటూరు, కృష్ణా తదితర ప్రాంతాల నుంచి సంక్రాంతి పండుగ అనంతరం మన ప్రాంతానికి వస్తుంటారు. సుమారుగా 20 ఏళ్లుగా ఉపాధి కోసం దూరప్రాంతాల నుంచి వచ్చి సుమారు మూడు, నాలుగు నెలల పాటు పచ్చాకు బంటలో పనిచేస్తూ పనులు ముగియగానే మళ్లీ వారి ప్రాంతాలకు వెళ్తున్నారు. వీరితోపాటు నీలిమందు, ప్లాస్టిక్ డబ్బాలు, రగ్గులు అమ్ముకునే వారు సైతం సరైన ఇళ్లు లేక పిల్లలు, మహిళలతో పాట్లు పడుతున్నారు.

పిల్లల యోగక్షేమాలు నిల్..

ఉపాధి కోసం ఈ ప్రాంతాలకు వచ్చిన కార్మికులు తమ పిల్లల ఆరోగ్యంపై అంతగా శ్రద్ధ పెట్టే అవకాశం ఉండదు. వారి యోగక్షేమాలను చూసుకునే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో ఎంతోమంది చిన్నారులు అనారోగ్యాలు గురికావడం, పలు ప్రమాదాల్లో పడడం చూస్తుంటాం. ఈనెల 24వ తేదీన నల్లజర్ల మండలం పోతవరంలో గుంటూరు జిల్లాకు చెందిన పొగాకు బంటా వలస కూలీలు వచ్చిన కొందరు పనుల్లో ఉండగా ఇంటి వద్ద ఉన్న సుమారు 8 మంది పిల్లలు ఉమ్మెత్త కాయలు తినడంతో ఫుడ్‌పాయిజన్ కావడంతో ఆసుపత్రి పాలు అయ్యారు. వారిని హుటాహుటిన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి, అక్కడ నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం అందించారు. మరోఘటన ఈనెల 24వ తేదీన కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ గుడారాలు ఏర్పాటు చేసుకుని నీలిమందు, ప్లాస్టిక్ సామగ్రి విక్రయించే ఒక కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురై అన్నదమ్ములు మృతి చెందారు. ఈవిధంగా వలస కూలీలు, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడుంటున్న కుటుంబాల పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు.

18 ఏళ్లుగా బంటా పనులకు వస్తున్నాం..

గడచిన 18 ఏళ్లగా పచ్చిఆకు బంటా పనుల నిమిత్తం ఈ ప్రాంతానికి వస్తున్నాం. సౌకర్యాలు ఎలా ఉన్నా కానీ పొట్టకూటి కోసం వచ్చి ఇక్కడ ఉండాల్సిన పరిస్థితి. మా పిల్లలను మా ఊరిలోనే అమ్మవాళ్ల వద్ద వదిలి వచ్చేశాం. అప్పుడప్పుడు వెళ్లి చూసుకుని వస్తా ఉంటాం.

- వెంకటరామయ్య, గుంటూరు, మేస్త్రీ




ఆచంటలో హెల్త్ క్యాంపు నిర్వహణ

శానిటేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆచంటలో శానిటేషన్ పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

▸ స్పందించిన అధికారులు ▸ మెగా వైద్య శిబిరం ఏర్పాటు

ఆచంట, జనవరి 28 : డెంగీతో ఆచంటలో సజ్జ శ్రీకాంత్ అనే యువకుడు మృతి చెందడంతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. వేమవరం పీహెచ్‌సీ వైద్య బృందం ఆధ్వర్యంలో ఆచంట శివారు రామాలయం, కుక్కలకోటి వీధిలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల ప్రజలు అందరికి వైద్య పరీక్షలు చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగబాబు ఈవోపీఆర్‌డీ మూర్తిబాబులు ఆధ్వర్యంలో గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శానిటేషన్ పనులు చేపట్టి దోమల నివారణకు స్ప్రే చేశారు. మురుగు బోదెలను శుభ్రం చేశారు. ప్రజలకు ఏమైనా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలని కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు సూచించారు.

మావుళ్ళమ్మకు కలెక్టర్ ప్రశాంతి పూజలు



నృత్య ప్రదర్శన అనంతరం కుమార్తెతో కలెక్టర్

భీమవరంటౌన్, జనవరి 28 : మావుళ్ళమ్మ అమ్మవారిని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం రాత్రి దర్శించుకుని పూజలు చేశారు. మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా కొటికలపూడి గోవిందరావు కళా వేదికపై కలెక్టర్ కుమార్తె సిరి భరత నాట్య ప్రదర్శన ఇచ్చిన సందర్భంగా ఆమెకుమార్తెతో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, ఈవ యర్రంశెట్టి భద్రాజీ ప్రసాదాలు శేషవస్త్రం అందజేశారు. ఆర్డీవో కె. శ్రీనివాసులరాజు, తహసీల్దార్ రవికుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు

ఆకట్టుకున్న సిరి నృత్యప్రదర్శన

మావుళ్ళమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు. పలు గీతాల్లో కలెక్టర్ కుమార్తె సిరి మిగిలిన చిన్నారులతో కలసి ప్రదర్శన చేసింది. కుమార్తె నృత్య ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 28 : ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. బండివారిగూడెం గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియెట్ వరకు చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటూ కూలి పనులకు వెళుతుంది. ఈనెల 20వ తేదీ రాత్రి 8 గంటలకు ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఆచూకీ తెలియలేదు. యువతి తండ్రి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మహిళను గాయపర్చిన వ్యక్తిపై కేసు

అత్తిలి, జనవరి 28 : అత్తిలిలో ఓ మహిళను కొట్టి గాయపర్చిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎస్.వెంకట్రావు తెలిపారు. అత్తిలికి చెందిన సప్పా లక్ష్మమ్మ తన ఇంట్లో టీవీ పాడైపోయిందని కుమారుడు బాగుచేయించడం లేదని తిట్టుకుంటున్న ఆమెపై ఇంటిపక్కన నివశిస్తున్న సూర్రెడ్డి శ్రీనివాసరావు చెక్కతో తలపై కొట్టగా గాయపడింది. కుమారుడు ఆమెను 108 అత్యవసర వాహనంలో తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె కుమారుడు ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

పాలకోడేరు, జనవరి 28 : వంట చేస్తుండగా మరిగిన నూనెలో నుంచి మంటలు వ్యాపించడంతో తాటాకిల్లుకు నిప్పు అంటుకుని దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.50వేల ఆస్తి నష్టం జరిగినట్టు అసిస్టెంట్ జిల్లా ఫైర్ అధికారి సూర్యప్రకాషరావు ఆదివారం తెలిపారు. పెన్నాడపాలెం రోడ్డులో కొండేటి కాంతమ్మ, చిన్ని దంపతులు ఓ తాటాకిల్లులో నివసిస్తున్నారు. ఆదివారం వంట చేస్తుండగా ప్రమాదం జరిగిందన్న సమాచారం అందడంతో ఫైర్ ఇంజన్‌తో మంటలను అదుపు చేశామన్నారు.

కాట్రేనిపాడులో గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ముసునూరు, జనవరి 28: మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో ఆదివారం ముసునూరు పోలీసులు మూడు కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఏలూరు నుంచి నూజివీడుకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా ఎస్ఐ వాసు తన సిబ్బందితో కలసి దాడిచేసి కాట్రేనిపాడులో పట్టుకున్నారు. దాడిలో మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందుతుల్లో ఒకరు ముసునూరు, మరొకరు గోపవరం గ్రామాలకు చెందిన వారు కాగా ఇద్దరు కాట్రేనిపాడు గ్రామానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. అయితే ఈ గంజాయి అమ్మకానికి సూత్రధారులు ఎవరు? గంజాయి ఎక్కడ నుంచి రవాణా అవుతోంది తదితర విషయాలపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రజకులకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకే మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు రూరల్, జనవరి 28: ఎన్నికల్లో రజకులకు మెజార్టీ సీట్లు కేటాయించిన పార్టీనే ఆదరిస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. జిల్లా రజక జన సంఘ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం రజకులకు కేటాయించాల్సిన దోబీఘాట్ నిధులకు గండికొట్టారని ఆరోపించారు. రజక వృత్తి చెరువుల విషయంలో జీవోలను అనుసరించకపోవడాన్ని ఆక్షేపించారు. కనీసం 2 అసెంబ్లీ, ఒక ఎమ్మెల్సీ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విటాల శ్రీనివాసరావు, కె.మురళి, జుజ్జువరపు శ్రీనివాసరావు, వై.నాగశేషు, చింతాడ శ్రీనివాసరావు, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఎలక్ట్రీషియన్లకు అవకాశం ఇవ్వాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ కార్మికులు

కామవరపుకోట, జనవరి 28: విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న ఎల్ఎంఎల్ఎం ఆపరేటర్స్ తదితర పోస్టుల్లో ప్రైవేటు విద్యుత్ కార్మికులకు అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, టీవీఎస్.రాజు డిమాండ్ చేశారు. ఆదివారం కామవరపుకోటలో విద్యుత్ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కొత్తూరు ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్నతనం నుంచి విద్యుత్ పనులు చేస్తున్న కుటుంబాలకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలని కోరారు. ప్రైవేటు విద్యుత్ కార్మికులు ప్రమాదంలో మరణించినా, సహజ మరణం చెందిన వారికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు బాలు, బాషా, మాధవ్, అమ్ము తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ కూటమి విజయంతో ప్రజలకు లబ్ధి


కరపత్రాలు అందజేస్తున్న అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 28: రానున్న ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం కూటమి విజయం సాధిస్తేనే అభివృద్ధి, సంక్షేమం ఉంటుందని, ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. స్థానిక అశోక్‌నగర్‌లో జనసేన పోరుబాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికి జనసేన పార్టీ కరపత్రాలు అందజేశారు. నగరంలో అభివృద్ధి లేదని, ఎమ్మెల్యేను గద్దె దింపాలని పిలుపునిచ్చారు. నగిరెడ్డి కాశీ నరేష్, నిమ్మల జ్యోతి కుమార్, ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్త, సుందరనీడి ప్రసాద్, సరిది రాజేష్, కావూరి వాణిశ్రీ, పల్లి విజయ్, కందుకూరి ఈశ్వరరావు, బొత్స మధు, ఎట్రించి ధర్మేంద్ర, రెడ్డి గౌరీశంకర్, బోండా రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రఘువీర్

ఏలూరు రూరల్, జనవరి 28: దొండపాడులోని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నివారణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రఘువీర్ త్యాగి మాట్లాడుతూ కుష్టువ్యాధి మైకో బ్యాక్టీరియమ్ లెప్రే వల్ల కలిగే దీర్ఘకాలిక అంటువ్యాధి అన్నారు. పాత చర్మం, ప్లాస్మా ఉపరితలాలు, కళ్లను ప్రభావితం చేస్తుందన్నారు. సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కుష్టువ్యాధి సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా సమూలంగా నిర్మూలించవచ్చన్నారు. పునరావాసకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో ఉరుసు మహోత్సవం


దర్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఏలూరు కల్చరల్, జనవరి 28: మెయిన్ బజారులోని గొలుసుల పంజా హజరత్ మౌలాలీ మహాత్ముల ఉరుసు మహోత్సవం ఆదివారం నిర్వహించారు. పంజా వంశపారంపర్య ముగావరులు ఎండీ ఖాజాఆలీ కుమారులు వజీర్‌ఆలీ, గాలబ్ మౌలాలి, ఖాదర్‌ఆలీ, నాజర్‌ఆలీ, ఉస్వర్‌ఆలీ, షాహిద్ ఆలీ, ఖాజా ఆలీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పూలచాందిని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల,మతాలకు అతీతంగా పలువురు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈనెల 30 వరకు ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ముదావరులు తెలిపారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


త్యాగరాజ ఆరాధనోత్సవంలో భక్తులు

ఏలూరు కల్చరల్, జనవరి 28: ఫైనార్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం సంస్థ అధ్యక్షుడు పరిమి సావిత్రి, సెక్రటరి దువ్వి హేమసుందర్, డీఏ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు మల్లాది నారాయణశర్మ త్యాగరాజ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ గుడిపాటి లలితా శర్మ, మేడూరి శివరామ్, రఘురామ్, పార్వతిరామచంద్రన్, గంగా భవానీ, ద్రోణంరాజు శైలజ, వేదుల జయలక్ష్మి, శిరీష, జి.లలిత, రాజేశ్వరి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, జనవరి 28: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామ సత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.50,875, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.15 వేలు, ఫోటో విక్రయాల ద్వారా రూ.3685 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.29,187 విరాళాలు అందించారని ఆయన చెప్పారు. కొవిడ్ నిబంధనలు అనుసరించి, భక్తులను అనుమతించామని, అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..

పారిశుధ్య సిబ్బంది కొరత.. డంపింగ్ యార్డ్ లేదు
దెందులూరులో అపారిశుధ్యం

దెందులూరు, జనవరి 28: ప్రభుత్వం పంచాయతీల నిధులకు గండి కొట్టడంతో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా పారిశుధ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. నియోజకవర్గ కేంద్రమైన దెందులూరులో డంపింగ్ యార్డు లేక టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోయి పరిస్థితి అధ్వానంగా తయారైంది. సర్పంచ్ ప్రతిపక్ష అభ్యర్థి కావడంతో డంపింగ్ యార్డు స్థల సేకరణలో రాజకీయ ఆటంకాలు కలుగుతున్నాయి. మరోవైపు చెత్త సేకరణకు పూర్తిస్థాయిలో పారిశుధ్య సిబ్బంది లేరు. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. మరోవైపు కొద్దిపాటి సిబ్బంది సేకరించిన చెత్త వేయడానికి స్థలం లేక గ్రామస్తులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇటీవల దెందులూరు గ్రామ పంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించారు. నూరు శాతం చెత్తను తొలగించడంతో పాటు తాగునీరు, అన్ని విభాగాల్లో ప్రగతి సాధించి ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛ కార్పొరేషన్, అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారులకు ఇక్కడి పరిస్థితులు సవాల్‌గా నిలిచాయి. బాలికల ఉన్నత పాఠశాల వద్ద, పోలీస్ స్టేషన్, గ్రంథాలయం, మహాత్మ గాంధీజీ విగ్రహాల వద్ద చెత్త పేరుకుపోయింది.

మేజర్ పంచాయతీ కావడంతో పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం జనాభా నిష్పత్తి మేరకు చెత్త సేకరణ, తరలింపునకు 52 మంది పారిశుధ్య కార్మికులు అవసరం. పంచాయతీలో 16 మంది మాత్రమే ఉండగా ఈ నెలలో మరో ఆరుగురిని నియమించడంతో 22 మంది ఉన్నారు. చెత్తను డంప్ చేయడానికి స్థలం లేదు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కనీసం చెత్త సమస్య పరిష్కారమయ్యే మార్గం కూడా కనిపించడం లేదు. అధికారులు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టినా నిధుల కొరత వేధిస్తోంది. చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామస్తులు సహకరించినా అధికారులు, ప్రజా ప్రజాప్రతినిధులు తీసుకునే చర్యలపై ఆసక్తి నెలకొంది.


దెందులూరులో గాంధీ విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్త

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం


రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల అభివాదం

ఏలూరు టూటౌన్, జనవరి 28: రైతులు, వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులకు, సామాన్య ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టం, అసైన్డ్‌భూముల చట్టం సవరణను రద్దు చేయాలని కార్మిక, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అన్నే భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు నాయకులు మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కుల చట్టంలో ప్రమాదకరమైన నిబంధనలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములు, నివాస స్థలాలు, భవనాలు, ఇతర స్థిరాస్తులపై హక్కులు నిర్ధారించి టైటిల్ రిజిస్టర్‌లో నమోదు చేసే అధికారాన్ని రెవెన్యూ అధికారులకు కట్టబెట్టడం మంచిది కాదన్నారు. కోర్టులు జోక్యం చేసుకునే అధికారం లేకుండా చేశారన్నారు. జగన్ ప్రభుత్వం ప్రధాని మోదీకి లొంగిపోయి రాష్ట్రంలో దేశంలోనే మొట్టమొదటిసారిగా చట్టాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ నిబంధనల వలన రైతుల భూముల్లో కార్పొరేట్ కంపెనీలకు అత్యంత సులభంగా కట్టబెట్టేందుకు వీలు కలుగుతుందన్నారు. భూ సమస్యలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసైన్డ్ భూముల చట్ట సవరణ ఆర్డినేన్స్ రద్దు చేసి 2013 భూసేకరణ చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలన్నారు. చట్టం రద్దు చేయాలని ఈ నెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ఎ.రవి, బీకేఎంయూ ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, అంబేడ్కర్ మిషన్ అధ్యక్షుడు ఎం.సంతోష్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ సెల్, విజిలెన్స్ మానటరింగ్ మాజీ సభ్యుడు నేతర అజయ్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డాంగే తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా శిబిరంలో సెర్ప్ ఉద్యోగులు

5వ రోజు సెర్ప్ ఉద్యోగుల ఆందోళన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 28: సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో సెర్ప్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా ఛైర్మన్ వి.బాపూజీ, కో కన్వీనర్ సీహెచ్.సుబ్బారావు మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గత 22ఏళ్లుగా హెచ్ఆర్ పాలసీ సౌకర్యం కలిగి ఉన్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. ఉద్యోగులు అందర్నీ రెగ్యులర్ చేయాలని, తెలంగాణ మాదిరి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సీలింగ్ విధానానికి బదులుగా 100శాతం బేసిక్ పేపై ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ అమలు చేయాలని, హెచ్ఆర్ఏ మంజూరులో పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వాకర్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

ఏలూరు రూరల్, జనవరి 28: ఏఎస్ఆర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.రాజేశ్వరి దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు ఎండీ అక్బర్, సెక్రటరి నాగవిజ్ఞేశ్వరరావు, ట్రెజరర్ విశ్వనాథ్ మాధవరావు, కె.నాగరాజు, శ్రీనివాసరావు, ఎస్.కె సత్తార్, బొంతిన రామకృష్ణ, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

పోరాడి సాధించుకున్న అంగన్వాడీలు

ఏలూరు టూటౌన్, జనవరి 28: అంగన్వాడీలు వీరోచితంగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచి తమ కోర్కెలు నెరవేర్చుకున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. అంగన్వాడీల అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లక్ష మంది మహిళలు 42 రోజుల పాటు పోరాడడం వలనే విజయాన్ని సాధించారన్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.రోజ మాట్లాడుతూ మొదట అంగన్వాడీలను పట్టించుకోని జగన్ తర్వాత దిగివచ్చి హామీలు నెరవేర్చారన్నారు. ఆమరణ దీక్షకు కూర్చున్న అంగన్వాడీ మినీ వర్కర్ భూదేవిని సన్మానించారు. భారతి, ఆర్.లింగరాజు, ప్రసాద్, రవి, విజయలక్ష్మి, మాణిక్యం, విమల, తులసి పాల్గొన్నారు.

రేపు కవితారచన విజేతలకు బహుమతులు

ఏలూరు టూటౌన్, జనవరి 28: మహాత్మగాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కవితారచన పోటీల్లో 21మంది ఉత్తమ రచయితలుగా ఎంపికయ్యారని సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 30వ తేదీన పెదనింద్రకొలను మహాత్మగాంధీ భవనంలో బహుమతులు అందజేస్తామన్నారు.




చింతలపూడి మండలంలో భవిష్యత్ గ్యారెంటీ పత్రాల పంపిణీ, కొయ్యలగూడెం, ఏలూరులో టీడీపీలో చేరిన నేతలు

త్వరలో సైకో పాలన అంతం : గన్ని

భీమడోలు, జనవరి 28: జగన్ సైకో పాలన త్వరలో అంతమవుతుం దని, జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఆదివా రం ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డికి మిగిలింది 74 రోజులు మాత్రమే వైసీపీ దురాగతాలకు, ప్రజా కోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని వైసీపీ చెబుతుంటే ప్రజలు కూడా ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులంతా సిద్ధంగా ఉన్నారని ఎన్నికల తరువాత వైసీపీ జెండా కనుమరుగు అవుతుందని తెలిపారు.

● పెదవేగి: అవినీతి, అక్రమాలు, దాడులు, దౌర్జన్యాల జగన్‌రెడ్డి పాలనపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించడానికి జనం సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో ఆయన మాట్లాడుతూ వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్షపడే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌రెడ్డి అహంకారానికి, వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు కర్షక, కార్మిక, ఉద్యోగు లంతా సిద్ధంగా ఉన్నారని, ఎన్నికల తరువాత వైసీపీ జెండా కనుమరుగవుతుందన్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు వైసీపీని వీడారని, రాబోయే రోజుల్లో వైసీపీ దుకాణం మొత్తం మూతపడుతుందన్నారు.

భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచారం

చింతలపూడి: టీడీపీ చేపట్ట బోయే ఆరు పథకాలపై వివరిస్తూ గ్యారెంటీ పత్రాలను ఇంటింటా కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దారా వీరేంద్ర లబ్దిదారులకు అందజేశారు. భట్టువారిగూడెంలోని 4, 5 వార్డుల్లో పర్యటించి ప్రతీ ఇంటికి సూపర్-6 పథకాలను వివరించారు. కార్యక్రమంలో కె.శ్రీరామ్మూర్తి, జి.పెదబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసలు

ఏలూరు టూటౌన్: టీడీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వంపై విసుగు చెందిన వారంతా టీడీపీలోకి చేరుతున్నారు. వందల మంది రెల్లి కులస్థులు బడేటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి సమక్షంలో ఆదివారం టీడీపీలో చేరారు. చంటి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ అంధకారం చేసి అరాచక పాలన సాగిస్తున్న జగన్‌ను సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, శివప్రసాద్, నాగరాజు, మల్లెపు రాము, రామలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: రాబోయే ఎన్నికల్లో భారీ విజయం కైవసం చేసుకుంటామని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గవరవరంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీ పార్టీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతీ గ్రామంలో టీడీపీలోకి భారీగా చేరుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలన్నీ నెవేరుస్తామన్నారు. గవరవరం పంచాయతీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్, రామారావు, నండూరి గోపి, తాతారావు, మల్లవరపు త్రిమూర్తులు, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి వద్ద దుర్గంధం


ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఎదురుగా రోడ్డుపై చేరిన డ్రెయినేజీ నీరు

ప్రభుత్వాసుపత్రి వ్యర్థాలతో డ్రెయినేజీ నీరు రోడ్డుపై చేరుతోంది. ఆర్ఆర్‌పేట వైపు, ఫైర్ స్టేషన్ నుంచి శనివారపుపేట డ్రెయిన్లలో మార్చురీ వద్ద వ్యర్థాలు, మృతదేహాలను శుభ్రపరిచిన తరువాత విడుదలయ్యే రసాయనాలు, వ్యర్థాలు కలుస్తాయి. కొద్ది రోజులుగా డ్రెయిన్లలో మురుగు ప్రవాహం నిలిచిపోయి రోడ్లపై చేరుతోంది. ప్రధాన డ్రెయిన్లు నగర పాలక సంస్థ సిబ్బంది శుభ్రపర్చకపోవడంతో రోడ్లపై చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. ఆసుపత్రి ఎదురుగా స్కూళ్లు, కాలేజీలు ఉండడంతో విద్యార్థులు వ్యాధుల బారినపడే ప్రమాదం ఉంది. శనివారపుపేట రోడ్డులో నిత్యం వందలాది మంది కాలినడకన మురుగు పక్క నుంచే వెళుతున్నారు. వాహనాల రాకపోకలతో మురుగు చిమ్ముతోంది. ఉన్నతాధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - ఏలూరు క్రైం

తవ్వి వదిలేశారు..


జంగారెడ్డిగూడెం పట్టణంలో తవ్వి వదిలేసిన సాలిపేట రహదారి

అసలే అంతంత మాత్రం రోడ్డు.. నిర్మాణ పనుల్లో భాగంగా తవ్వి వదిలేయడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు చెప్పనలవి కాదు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని సాలిపేట రహదారి అధ్వానం కావడంతో మున్సిపల్ సాధారణ నిధులు రూ.70 లక్షలతో జేపీ సెంటర్ నుంచి రావూరి జంక్షన్ వరకు రహదారి నిర్మాణం చేపట్టారు. నెల రోజుల క్రితం రహదారి తవ్వి వదిలేశారు. తర్వాత పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. జేపీ సెంటర్ నుంచి రావూరి జంక్షన్ వరకు నిత్యం రద్దీగా ఉండే రహదారి. ఇరువైపులా చిన్నపాటి టిఫిన్ బళ్లు, చిన్నచిన్న దుకాణాలు, నివాసాలు ఉన్నాయి. దుమ్ముధూళి టిఫిన్ దుకాణాలు, ఇళ్లలో చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని తడిపి దాఖలాలు లేవని, తక్షణం పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. - జంగారెడ్డిగూడెం

జనసేన ఆధ్వర్యంలో రహదారి మరమ్మతు పనులు


రహదారి మార్జిన్ పనులు చేయిస్తున్న బాలరాజు

జీలుగుమిల్లి, జనవరి 28: రహదారులు దెబ్బతినడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బర్రింకలపాడు వద్ద రహదారికి ఇరు వైపులా ఆదివారం రోడ్డు మరమ్మతు పనుల్ని జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు చేయించారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు రహదారి దుస్థితిపై తెలిపినా చర్యలు తీసుకోలేదన్నారు. గిరిజన పాఠశాల సమీపంలో జాతీయ రహదారి రెండు వైపులా గోతులు పూడ్చి తుప్పలు తొలగించారు. జనసేన ఆధ్వర్యంలో సమస్య పరిష్కారం కావడంతో సమీప గ్రామాల వారు హర్షం వ్యక్తం చేశారు.

వచ్చే నెల 10న డీటీఎఫ్ రజతోత్సవం

ఏలూరు టూటౌన్, జనవరి 28: డీటీఎఫ్ రజతోత్సవం విశాఖపట్నంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో డీటీఎఫ్ సమావేశం జిల్లా అధ్యక్షుడు కాంతరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ, నరహరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించి రావల్సిన బకాయిలు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, త్రినాధరావు, శ్రీనివాసరావు, అనంతకుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలాల కన్వీనర్‌లను ఎన్నుకున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు క్రైం :** ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు, సబ్ డివిజన్ల పరిధితోపాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. బ్యాంక్ ఎటీఎంల వద్ద ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తుగా రాత్రి పూట పోలీసులు గస్తీ నిర్వహించి సంబంధిత ప్రాంతాల వాచ్‌మెన్‌లను అప్రమత్తం చేశారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** పవరుపేట స్టేషన్ రోడ్డులో ధన్వంతరి వైద్య భగవానుడిని ఆదివారం భక్తులు దర్శించుకుని సామూహిక అర్చనలు జరిపారు. స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చారు.
- **చింతలపూడి :** ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ శాఖ అధ్యక్షులుగా వజ్రపు శేఖర్, కార్యదర్శిగా కొనకళ్ళ ప్రసాద్, కోశాధికారిగా చిట్లూరి వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ ఆర్యవైశ్యమహిళా సంఘ అధ్యక్షులుగా కొనకళ్ళ రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా కేతేపల్లి స్రవంతి, కోశాధికారిగా భవాని ఎన్నికయ్యారు. మండల అధ్యక్షులుగా అడపా రాజారావు, ఉపాధ్యక్షులుగా చవ్వా శ్రీనివాస్, కార్యదర్శిగా కంభంపాటి నారాయణ ఎన్నికయ్యారు.
- **కుక్కునూరు :** ఉప్పరమద్దిగట్ల గ్రామానికి చెందిన మాటూరి వీరవసంత్ పొలంలో పనిచేస్తూ పాముకాటుకు గురయ్యాడు. పీహెచ్‌సీలో వైద్యం అనంతరం భద్రాచలం ప్రభుత్వాసుపత్రికి బాధితుడు క్షేమంగానే ఉన్నట్టు వైద్యులు రమేష్ తెలిపారు.
- **బుట్టాయగూడెం :** విప్పలపాడుకు చెందిన సోదెం రాజేష్ ఇటీవల ప్రమాదంలో మరణించాడు. మృతుడి భార్య గంటసాలమ్మకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు రూ. 10 వేలు అందజేశారు.
- **లింగపాలెం :** ధర్మాజీగూడెంలో వాసవీక్లబ్, వనితాక్లబ్ సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. సోమిశెట్టి గంగాధర్‌రావు, కందుల రత్నమాల, ప్రకాశరావు, సభ్యులు పాల్గొన్నారు.
- **భీమడోలు :** మానవత ఆధ్వర్యంలో పూళ్ళ గ్రామానికి చెందిన పేద విద్యార్థినికి 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వచ్చే నెల 8 మంది పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యానిధి నుంచి ఇద్దరు విద్యార్థులకు రూ.25 వేలు ఇవ్వాలని తీర్మానించారు. అప్పిక రాంబాబు, జిల్లా కో ఆర్డినేటర్ గంగాధర్, నూకరాజు, ఉమామహేశ్వరరావు, అల్లాడ ప్రసాదరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.






టి.నరసాపురం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట మండలాల్లో బూత్, క్లస్టర్ స్థాయి శిక్షణ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు

టీడీపీ క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలకు
సమగ్ర శిక్షణ

టి.నరసాపురం, జనవరి 28: రానున్న ఎన్నికల్లో బూత్ ఇన్‌చార్జిలే కీలకమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామమూర్తి అన్నారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. బూత్ ఇన్‌చార్జ్‌లు వారి పరిధిలో కుటుంబ సాధికారిక సారధులను నియమించుకుని ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవాలన్నారు. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంతో అర్హులకు తెలుగుదేశం మిని మేనిఫెస్టో పథకాలను రిజిస్ట్రేషన్, ప్రతిరోజూ ఓటర్ వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అక్రమ మార్గాలలో గెలవాలని చూస్తుందని దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత క్షేత్రస్థాయిలో నాయకులపై ఉందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందన్నారు. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జి సందేపూడి సాయి, యూనిట్ ఇన్‌చార్జిలు పెద్దిన శేఖర్, దవులూరి క్రిష్ణ, బచ్చల వెంకటేశ్వరరావు, మాధవరావు, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

● చింతలపూడి: యుద్ధం మొదలైంది, జగన్ రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధమయ్యారని నియోజకవర్గ టీడీపీ మాజీ కన్వీనర్ జె.ముత్తారెడ్డి అన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన గెలుపు ఖాయమన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా ఎన్నికల్లో వ్యవహరించాలన్నారు. క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలకు ఉండవల్లి బాలానందం శిక్షణ ఇచ్చారు. మండల అధ్యక్షుడు మాటూరి వెంకట్రామయ్య, పక్కాల వెంకటేశ్వరరావు, బోడా నాగభూషణం, అనీష్‌కుమార్, కె.రాజారెడ్డి, సీహెచ్.సుధీర్‌రెడ్డి, కొప్పెర్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా ఐ టీడీపీ కన్వీనర్ చావలి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో మండల, పట్టణ పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్‌లకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. భవిష్యత్ గ్యారంటీ, ఓటర్ వెరిఫికేషన్, మన టీడీపీ, టెలిగ్రామ్‌లపై శిక్షణ ఇచ్చారు. సాయిల సత్యనారాయణ, రావూరి కృష్ణ, తూటికుంట రాము, చేను ప్రసాద్, బేతాళ మురళి, కంచర్ల గణేష్, మనెల్లి బాలు, గుబ్బా రాంబాబు, కుక్కల మాధవరావు, ఆరుగొల్లు గంగ, గోలి అనిల్, కొఠారి ప్రసాద్, ముళ్ళపూడి శ్రీను, బలుసు కిరణ్ కుమార్, తానిగడప నరేష్ కుమార్, లింగాల సత్యనారాయణ, ఉండవల్లి చంద్రరావు, ఉండవల్లి రవి, యరమళ్ళ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు

● లింగపాలెం: టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు ఆధ్వర్యంలో క్లస్టర్ బూత్ లెవెల్ ఇన్‌చార్జిలకు శిక్షణ ఇచ్చారు. బూత్ ఇన్‌చార్జ్‌లు తమతమ పరిధిలో ఓటర్లకు తెలుగుదేశంపార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికి చేరవేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మోరంపూడి మల్లికార్జునరావు, తాతిన రాధాకృష్ణ, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, తాళం సోంబాబు, శ్రీను, మండలంలోని పలువురు బూత్‌క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

● కామవరపుకోట: పాతూరులో టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ అధ్యక్షతన క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్‌చార్జ్‌లకు సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో సత్ఫలితాలు సాధించిన కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ప్రశంసాపత్రాలను అందజేశారు. సుభాష్‌చంద్రబోస్, మనెల్లి బాలు శిక్షణ ఇచ్చారు. బొబ్బిలి దాస్ దివాకర్, సిరిగిబత్తుల నాగరాజు, మాన్యం దుర్గారావు, వజీర్‌ఖాన్, జీలా విజయ్, పర్వా శ్రీను, పసుమర్తి పార్థసారధిబాబు పాల్గొన్నారు.

పెద్దపులి పంజా

- దేవినేనివారిగూడెంలో పశువులపై దాడి
- ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారుల సూచన
- ముండూరు సమీపంలో బోను ఏర్పాటు

ద్వారకాతిరుమల, జనవరి 28 : పెద్దపులి పంజా విసిరిన ఘటన దేవినేనివారిగూడెంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామంలో రెండు ఆవులు, ఓ దూడపై పులి దాడి చేయడంతో అవి బెంబేలెత్తి కట్లు తెంపుకుని రోడ్డుపైకి పరుగులు తీశాయి. రైతులు, స్థానికుల గుండెల్లో భయం పెరిగింది. బయటకు వెళ్లాలంటే భయపడిపోతున్నారు. వివరాలివి.. తిమ్మాపురానికి చెందిన రైతు పాకలపాటి మధుకు దేవినేనివారిగూడెంలో పొలం ఉంది. ఆయన ఆదివారం ఉదయం నాలుగు గంటలకు పొలానికి వచ్చేసరికి తన మూడు ఆవులు గాయాలతో రోడ్డుపై అరుస్తూ నిలబడి ఉండడాన్ని చూసి వాటిని పరిశీలించి సాటిరైతులకు సమాచారం ఇచ్చాడు. అందరూ వచ్చిచూడగా ఆవులపై పులి గోళ్లతో దాడి చేసినట్టు గుర్తించి ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రధామ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. దాడికి గురైన ఆవులను, ఆ ప్రాంతంలో పులి అడుగుజాడలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులనుంచి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాపికొండల అటవీప్రాంతం నుంచి పులి తప్పిపోయి వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. ఇది పగలంతా విశ్రాంతి తీసుకుంటూ రాత్రివేళ రోజుకు దాదాపు 15 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని, కొద్దిరోజులు రైతులు, స్థానికులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఎవరూ హాని కల్గించవద్దని అలాచేస్తే వన్యప్రాణిరక్షణ చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. గ్రామాల్లో సాయంత్రం ఐదు ఐదు గంటల తర్వాత తిరగద్దని టాంటాం వేయించాలని సూచించారు. రైతుల పశువులకు ఈ పులివల్ల నష్టం జరిగితే నష్టపరిహారం చెల్లిస్తామన్నారు.



పులిని బంధించడం కోసం తీసుకొస్తున్న బోను

బోను ఏర్పాటు చేస్తున్నాం : రవీంద్ర దామా

పెదవేగి, జనవరి 28 : ముండూరు పరిసర ప్రాంతాల్లో పెద్దపులి కదలికలను గుర్తించామని, పులిని పట్టుకునేందుకు బోను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా అటవీశాఖాధికారి రవీంద్ర దామా తెలిపారు. శనివారం ఉదయం దెందులూరు మండలం పెరుగ్గూడెం, చల్లచింతలపూడి గ్రామాల్లో పులి పాదముద్రలు గుర్తించగా, ఆదివారం మేదినరావుపాలెం మీదుగా పెదవేగి మండలం ముండూరు సమీపంలో పోలవరం కుడికాలువ సమీపంలో పంటపొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. రాజమహేంద్రవరం ముఖ్య అటవీ సంరక్షణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, రాజమహేంద్రవరం డీఎఫ్‌వో ఎ.త్రిమూర్తులురెడ్డి, ఇతర అధికారులతో కలిసి పులి తిరిగినట్టు గుర్తించిన ప్రదేశాల్లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముండూరు, మేదినరావుపాలెం, ధర్మారావుపేట, చక్రాయగూడెం, సీతారామపురం గ్రామాల చుట్టుపక్కల పులి తిరుగుతున్నట్టు గుర్తించామన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాత్రి సమయంలో ఒంటరిగా పొలాలకు వెళ్ళవద్దు, ముఖ్యంగా పోలవరం కుడికాలువ పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. పెద్దపులిగా అనుమానిస్తున్న జంతువు సమాచారం తెలిస్తే అటవీశాఖాధికారులకు సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1800 425 5909 కు అందించాలని సూచించారు.



దేవినేనివారిగూడెం గ్రామస్థులతో మాట్లాడుతున్న అటవీఅధికారి రవీంద్ర



పులి దాడికి గురైన ఆవు



పులి పాదముద్ర

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముసునూరు, జనవరి 28: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జి.రాణి తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

అభ్యర్థి ప్రచారంలో వైసీపీ కుట్ర : ముద్దరబోయిన

నూజివీడు, జనవరి 28: నూజివీడు టీడీపీ టిక్కెట్ విషయంలో తనకు ఇంతవరకు ఎలాంటి సమాచారం లేదని, ఆ పార్టీ నూజివీడు ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ళ నుంచి ఇక్కడ పార్టీ కోసం కృషి చేశానని, కొద్దిరోజులుగా పెనమలూరు ఎమ్మెల్యే, వైసీపీకి చెందిన పార్థసారథి నూజివీడు టీడీపీ అభ్యర్థిగా ఖరారైనట్టు ప్రచారం జరుగుతోందని, అసలు పార్టీలోనే చేరని పార్థసారథికి నూజివీడు టీడీపీ అభ్యర్థిగా జరుగుతున్న ప్రచారం వెనుక వైసీపీ కుట్ర ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జగదీష్

చాట్రాయి, జనవరి 28: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. జగదీష్, వైవీ నరసింహ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి రామకృష్ణ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ఎం. నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కె. రవీంద్ర, కోశాధికారిగా సీహెచ్ సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా సీహెచ్ ప్రసాద్, పి. నవ్య ఎన్నికైనట్టు ప్రకటించారు. ఎన్నికైన వారిని మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలి : మంగినేని



ముదినేపల్లి, జనవరి 28: తుపానుకు సార్వా నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని పీసీసీ సభ్యుడు మంగినేని బాబ్జీ డిమాండ్ చేశారు. పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి చేరి రెండు నెలలు గడుస్తున్నా రైతులకు నష్టపరిహారం నిధులను మంజూరు చేయకపోవటంతో శోచనీయమన్నారు. తుఫాను ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రెండుసార్లు నష్టాలను ఎదుర్కొన్న రైతులకు నష్టపరిహారం వెంటనే విడుదల చేసి ఆదుకోవాలన్నారు. నష్టం వివరాలు అందిన పది రోజుల్లోగా రైతుల ఖాతాలకు పరిహారం సొమ్ము జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పు డు నెలల తరబడి జాప్యం చేస్తోందన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు మొర

ముదినేపల్లి రూరల్, జనవరి 28: మండలంలోని వాడవల్లి, రావిగుంట, ఊటుకూరు గ్రామంలో నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు ఆదివారం ప్రారంభించారు. వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరు సునీల్‌కుమార్‌ను ఆయా గ్రామాల ప్రజలకు పరిచయం చేశారు. ఆయా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి భక్తుల తాకిడి

ముదినేపల్లి రూరల్, జనవరి 28: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.



ముదినేపల్లిలో శ్మశాన వాటిక రహదారి దుస్థితి

అంత్యక్రియలకు పాట్లు..

శ్మశాన వాటిక రహదారి ఛిద్రం

ముదినేపల్లి, జనవరి 28 : ముదినేపల్లిలో ఉమ్మడి శ్మశాన వాటికకు సరైన రహదారి సౌకర్యం లేకుండాపోయింది. శ్మశానంలోకి వెళ్లేందుకు జాతీయ రహదారి నుంచి గతంలో నిర్మించిన సీసీ రోడ్డు ధ్వంసమై పోయింది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పక్కా డ్రైన్ల నిర్మాణం పూర్తి కాకపోవటంతో శ్మశానానికి వెళ్లే రహదారి కోసుకు పోయింది. దీంతో మృతదేహాలను తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని వాపోతున్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు అందరికీ ఉమ్మడి శ్మశాన వాటిక ఇదే. మృతదేహాన్నిలోనికి తీసుకెళ్లే వారి ఇబ్బందులు చెప్పనలవికాదు. పంచాయతీ అధికారులు దీనిపై చర్యలు తీసుకుని రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థలాలిచ్చారు... రహదారి మరిచారు!

ఇంటి నిర్మాణమెలా..?





రహదారి సౌకర్యం లేక నిలిచిపోయిన గృహనిర్మాణాలు (ఇన్‌సెట్) మండవల్లి జగనన్న కాలనీలో మట్టి రోడ్డు కుంగిన దృశ్యం

- రహదారి సౌకర్యం లేక జగనన్న కాలనీ లబ్ధిదారుల పాట్లు
- నిర్మాణ సామగ్రి తరలింపే అసలు సమస్య
- మండవల్లి జగనన్న కాలనీ లబ్ధిదారుల అయోమయం

పేద వర్గాల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. ఇంటి నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఆ స్థలాల్లో ఇంటి నిర్మాణాలకు మెటీరియల్ తరలించడం అసాధ్యంగా మారింది. అయితే కాలనీలో రహదారులు ఏర్పాటు చేయడంలో విఫలమైంది. కనీసం ఆటోల్లోనైనా మెటీరియల్ తరలించలేకపోతున్నామని లబ్ధిదారులు వాపోతున్నారు.

మండవల్లి, జనవరి 28: మండవల్లిలోని మూడుతాళ్లపాడు రోడ్లో సుమారు 200 మందికి ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన పంటభూమికి హడావుడిగా మెరకు పనులు కూడా చేశారు. లబ్ధిదారులకు పట్టాల పంపిణీ జరిగింది. తక్షణమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్న ఆదేశాలతో లబ్ధిదారులు అప్పు తెచ్చి మరీ పనులు చేపట్టారు. అయితే జగనన్న కాలనీలో రహదారి సౌకర్యం లేక మెటీరియల్ తరలించేందుకు ట్రాక్టర్లు వెళ్లే మార్గం లేక లబ్ధిదారుల వెతలు వర్ణనాతీతం. ఆటోలో సైతం ఈ దారిలో మెటీరియల్‌ను తరలించలేకపోతున్నారు. దీంతో కొందరు గృహనిర్మాణ పనులే మొదలు పెట్టలేదు. గృహనిర్మాణానికి వినియోగించే ఇసుక, కంకర, ఐరన్, సిమెంట్, సెంట్రింగ్ సామగ్రి తరలించాలంటే లబ్ధిదారులకు తలకు మించిన భారం అవుతోంది. ఇంటి నిర్మాణాలు చేపట్టాలంటే ముందుగా రోడ్డు సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు అధికారులను కోరుతున్నారు.

రేపు కవితారచన విజేతలకు బహుమతులు

ఏలూరు టూటౌన్, జనవరి 28: మహాత్మగాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన కవితారచన పోటీల్లో 21మంది ఉత్తమ రచయితలుగా ఎంపికయ్యారని సర్వోదయ మండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 30వ తేదీ పెదనింద్రకొలను మహాత్మాగాంధీ భవనంలో బహుమతులు అందజేస్తామన్నారు.

వచ్చే నెల 10న డీటీఎఫ్ రజతోత్సవం

ఏలూరు టూటౌన్, జనవరి 28: డీటీఎఫ్ రజతోత్సవం విశాఖపట్నంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో డీటీఎఫ్ సమావేశం జిల్లా అధ్యక్షుడు కాం తరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఆది నారాయణ, నరహరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరి ష్కరించి రావల్సిన బకాయిలు సకాలంలో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, త్రినాధరావు, శ్రీనివాసరావు, అనంతకుమార్, తదితరులు పాల్గొన్నారు. అనం తరం మండలాల కన్వీనర్లను ఎన్నుకున్నారు.

రజకులకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకే మద్దతు



ఏలూరు రూరల్, జనవరి 28: ఎన్నికల్లో రజకులకు మెజా ర్టీ సీట్లు కేటాయించిన పార్టీనే ఆదరిస్తామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. జిల్లా రజక జన సంఘ భవనంలో ఆదివా రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం రజకులకు కేటాయించాల్సిన దోబీఘాట్ నిధులకు గండికొట్టారని ఆరోపించారు. రజక వృత్తి చెరువుల విషయంలో జీవోలను అనుసరించకపోవడాన్ని ఆక్షేపించారు. కనీసం 2 అసెంబ్లీ, ఒక ఎమ్మెల్సీ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విటాల శ్రీనివాసరావు, కె.మురళి, జుజ్జువరపు శ్రీనివాసరావు, వై.నాగేశ్వ, చింతాడ శ్రీనివాసరావు, పి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఎలక్ట్రీషియన్లకు అవకాశం ఇవ్వాలి

కామవరపుకోట, జనవరి 28: విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న ఎల్ఎంఎఎల్ఎం ఆపరేటర్స్ తది తర పోస్టుల్లో ప్రైవేటు విద్యుత్ కార్మికులకు అవకాశం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, టీవీఎస్.రాజు డిమాండ్ చేశారు. ఆదివారం కామవరపుకోటలో విద్యుత్ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కొత్తూరు ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లా డుతూ చిన్నతనం నుంచి విద్యుత్ పనులు చేస్తున్న కుటుంబాలకు ప్రోత్సాహన్ని ఇవ్వాలని కోరారు. ప్రైవేటు విద్యుత్ కార్మికులు ప్రమాదంలో మరణించినా, సహజ మరణం చెందిన వారికి రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు బాలు, బాషా, మాధవ్, అమ్ము తదితరులు పాల్గొన్నారు.



చాట్రాయిలో పూత వచ్చిన మామిడితోట

ఆశాజనకంగా మామిడి పూత

చాట్రాయి, జనవరి 28: మామిడితోటల్లో పూత బాగుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సరైన యాజమాన్య పద్ధతులు పాటించిన తోటల్లో మామిడి పూతలు కన్పిస్తున్నాయి. మిచౌంగ్ తుఫాన్ కారణంగా పూతలు ఆలస్యం కావటంతో రైతులు ఆందోళన చెందారు. ఎట్టకేలకు పూతలు వస్తుండటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. వచ్చిన పూత నిలబడి మంచి దిగుబడులు వస్తే లాభాలు పొందవచ్చునని రైతులు ఆశిస్తున్నారు.

తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి..

పూత దశలో వచ్చే తెగుళ్ళ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానశాఖ అధికారిణి హేమ కోరారు. పచ్చిపూత మీద తేనె మంచు పురుగు ఉంటే ఎసిఫేట్ 1.5 గ్రాము, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలన్నారు. తెగుళ్ళు ఆశించే తోటల్లో కార్బండిజమ్ 2 గ్రాములు, లేదా సాఫ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలని సూచించారు.



మట్టగుంటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బీసీలపై వైసీపీ కపట ప్రేమ

కలిదిండి, జనవరి 28: బీసీలపై వైసీపీ కపట ప్రేమ చూపుతూ అడుగడుగునా మోసం చేస్తోందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం మట్టగుంటలో టీడీపీ నాయకులతో కలసి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అంద్రాజు మాట్లాడుతూ బీసీ రక్షణ చట్టం టీడీపీ తోనే సాధ్యమని, బీసీలంతా టీడీపీ విజయానికి సహకరించాలన్నారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బళ్ల రాజు, బూత్ కన్వీనర్ తిరుమలశెట్టి పరశురాముడు, నాయకులు తిరుమాని చిన్న కృష్ణ, తిరుమలశెట్టి రామారావు, నడకుదుటి ఆంజనేయులు పాల్గొన్నారు.



మండవల్లి టీంను అభినందిస్తున్న దృశ్యం

ఖోఖో విజేత మండవల్లి టీం

మండవల్లి, జనవరి 28: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఖోఖో క్రీడా పోటీల్లో మండవల్లి మండల టీమ్ ప్రతిభ చూపింది. కైకలూరు నియోజకవర్గం స్థాయిలో జరిగిన ఖోఖో పోటీల్లో బొమ్మినంపాడు టీంపై మండవల్లి టీం 2-14 స్కోరుతో విజయం సాధించింది. విజేతలను ఆదివారం సచివాలయం వద్ద జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మండవల్లి సర్పంచ్ మెండ రూన్సీ సురేష్‌బాబు, వీపీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ల, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, కార్యదర్శి టి. శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది క్రీడాకారులను, కోచ్ జె. శ్రీనివాసరావును అభినందించారు.

చేతికందే ప్రమాదం



ఆగిరిపల్లి, జనవరి 28: ఆగిరిపల్లి-గన్నవరం రోడ్డులో గల పంచాయతీ ఆఫీస్ ఎదురుగా ఉన్న కరెంటు స్తంభానికి స్థానిక విద్యుత్‌శాఖ పిల్లలకు అందేలా స్ట్రీట్‌లైట్‌కు సంబంధించిన ఫ్యూజు ఏర్పాటు చేసింది. ఈ రహదారిలోనే ప్రైవేటు పాఠశాల ఉండగా వందలాది మంది పిల్లలు ఈ ఫ్యూజుకు దగ్గరగా వెళుతుంటారు. ప్రమాదం జరిగేలోపే విద్యుత్ శాఖ ఫ్యూజు బాక్సు ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం



నూజివీడు టౌన్, జనవరి 28: డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో నూజివీడు మండలం రావిచర్ల గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మొక్కపాటి పూర్ణచంద్రరావు 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించగా, జనరల్, కంటి, ఎముకలు, దంత సమస్యలున్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. శిబిరాన్ని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, సర్పంచ్ కాపా శ్రీనివాసరావు ప్రారంభించగా, మొక్కపాటి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ లావుప్రసాద్, వైద్యులు పద్మసుందరి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

- ప్రమాదకరంగా వంతెన అప్రోచ్ రోడ్డు వద్ద గొయ్యి

కలిదిండి, జనవరి 28 : గుర్వాయిపాలెం వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురై పెద్ద గొయ్యి ఏర్పడింది. ద్విచక్ర వాహన చోదకులు ఈ గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఈ గొయ్యి లోతుగా ఉండటంతో వాహనాలు గోతిలో ఇరుక్కుంటున్నాయి. ఈ వంతెన సమీపంలో వాహనదారులు ఆదమరిచి వాహనం నడిపితే అంతే సంగతులు. రాత్రి పూట ఈ అప్రోచ్ రోడ్డుపై రాకపోకలు సాగించటానికి ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. గుర్వాయిపాలెం, కొత్తూరు, సంతోషపురం, భాస్కరరావుపేట, మూల్లంక, పెదలంక గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. గొయ్యిని పూడ్చాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గొయ్యి పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న పెద్ద గొయ్యి

క్రైం కార్నర్

కాట్రేనిపాడులో గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

ముసునూరు, జనవరి 28: మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో ఆదివారం ముసునూరు పోలీసులు మూడు కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఏలూరు నుంచి నూజివీడుకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా ఎస్ఐ వాసు తన సిబ్బందితో కలసి చాకచక్యంగా దాడిచేసి కాట్రేనిపాడులో పట్టుకున్నారు. ఈ దాడిలో మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని, ఆటోను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. నిందుతుల్లో ఒకరు ముసునూరు, మరొకరు గోపవరం గ్రామాలకు చెందిన వారు కాగా ఇద్దరు కాట్రేనిపాడు గ్రామానికి చెందిన వారిగా గుర్తించామన్నారు. అయితే ఈ గంజాయి అమ్మకానికి సూత్రధారులు ఎవరు? గంజాయి ఎక్కడ నుంచి రవాణా అవుతోంది తదితర విషయాలపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్..

వీఆర్వో దంపతులకు గాయాలు



గాయపడిన కొండంగి వీఆర్వో మార్తమ్మ

కలిదిండి, జనవరి 28 : రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాల పాలయ్యారు. కొండంగి గ్రామానికి చెందిన పాస్టర్ కాగితాల రాజేష్, ఆయన సతీమణి, కొండంగి వీఆర్వో మార్తమ్మ బైక్‌పై కొండంగి నుంచి కలిదిండి వెళ్తుండగా, గుర్వాయిపాలెం ఇటుకల బట్టీ సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వీరిని ఆకివీడు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ డ్రైవర్ పరారవడంతో పోలీసులు వ్యానును స్వాధీనం చేసుకున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి



పోలీసుల స్వాధీనం చేసుకున్న వాహనాలు

ముసునూరు, జనవరి 28: మండలంలోని కాట్రేనిపాడు శివారు పామాయిల్ తోటలో పేకాట శిబిరంపై ముసునూరు పోలీసులు శనివారం రాత్రి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 10 మోటారు వాహనాలు, రూ. 22 వేలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వాసు తెలిపారు. మండలంలో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కలిదిండి: సానారుద్రవరంలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.24 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

మద్యం స్వాధీనం

ముదినేపల్లి, జనవరి 28 : అనధికార మద్యం అమ్మకాలపై ముదినేపల్లి పోలీసులు మరింత నిఘా పెంచారు. దాడులు ముమ్మరం చేశారు. గత 15 రోజులుగా వివిధ గ్రామాల్లో బెల్టుషాపులపై దాడులు నిర్వహించి, సుమారు 62 బాటిళ్లను స్వాధీనం చేసుకోగా, ఆదివారం వడాలి వద్ద దాడులు నిర్వహించి ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ముక్కు వీరయ్య అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ వెంకట్ కుమార్ తెలిపారు.